సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 28 । మే । 2023



నేలబావిలోకి ట్రాక్టర్

అప్పారావుపేటలో ట్రాక్టర్ నేలబావిలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ మృతి చెందారు.

- 8లో



ఆదర్శ గ్రామంగా చీపి

మందస మండలంలోని చీపి ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. అధికారులు ఆ గ్రామాన్ని పరిశీలించారు.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	41°	26°
ఇచ్ఛాపురం	42°	27°
పాతపట్నం	42°	27°
శ్రీకాకుళం	42°	26°

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలని వినతి



స్పీకర్ తమ్మినేనికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

ఆమదాలవలస: ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించేలా చూడాలని, సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని 'ఏపీ జేఏసీ,అమరావతి' ఉద్యోగ సంఘాల నేతలు స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఉద్యోగ సంఘ నేతలు స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందజేశారు. తమ సమస్యలకు పరిష్కారం జరిగేలా, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని సంఘ నేతలు సభాపతికి విన్నవించారు.

2న అరుణాచలంకు ప్రత్యేక బస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: పౌర్ణమి సందర్భంగా జూన్ 2వ తేదీన అరుణాచలంలో గిరిప్రదక్షిణ మహోత్సవాలకు శ్రీకాకుళం నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కేఎస్ఆర్ శర్మ తెలిపారు. జూన్ 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఆర్టీసీ బస్సు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి 3న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్, కంచి దర్శించుకుని అదే రోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 4వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందని అన్నారు. అరుణాచల గిరిప్రదక్షిణ, దర్శనం అనంతరం సాయంత్రం బయలుదేరి 5వ తేదీ సాయంత్రానికి శ్రీకాకుళం చేరుతుందని తెలిపారు. మనిషి ఒకరికి టికెట్ చార్జి రూ.4500గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.కామ్ ద్వారా కొనుగోలు చేయవచ్చునని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382921647, 7601038583 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం గిరి ప్రదక్షిణ పోస్టర్ ఆవిష్కరించారు.

'కంటి వెలుగులో జిల్లా ప్రథమం'



శ్రీకాకుళం దండివీధిలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: అంధత్వ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం అమలులో రాష్ట్రంలో మన జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి ప్రకటించారు. శనివారం స్థానిక నగరంలో దండివీధి సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 60 ఏళ్లు దాటిన వారు 2.94 లక్షల మందిని గుర్తించి స్క్రీనింగ్ పూర్తి చేసినట్లుగా వివరించారు. ఇందులో 12 వేల మందికి శస్త్రచికిత్సలు పూర్తి చేశామని, ఇంకో 8 వేల మందికి చేయాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 వైద్య శిబిరాలు కంటి వెలుగుపై సర్వే నిర్వహిస్తున్నాయని, అలాగే 83 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కంటి అద్దాలను కూడా పంపిణీ చేశామని వివరించారు.

జ్ఞాపకాల రుతువు



- ఆనందాల అపూర్వ సమ్మేళనాలు
- ఏళ్ల తర్వాత కలుస్తున్న బాల్యమిత్రులు
- సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న వైనం
- జిల్లాలో గెట్ టు గెదర్ సీజన్

బడి ఒడిలో వదిలేసిన ఓ గురుతు ఇప్పుడు గుండె గదిలో జ్ఞాపకమై చిగురిస్తోంది. కాలేజీ ఫేర్‌వెల్ డే నాడు ఆగిపోయిన స్నేహగీతం.. ఇన్నాళ్లకు కొత్త కోయిల రాగమై వినిపిస్తోంది. బాల్యం అందించిన ఆనందం.. ఇప్పుడు మళ్లీ కావాలనిపిస్తోంది. ఆ రోజుల పేజీలు వెనక్కి తిప్పాలనిపిస్తోంది. స్కూల్‌లో పక్కన కూర్చున్న మిత్రుడు, కాలేజీలో సైకిల్‌పై చోటిచ్చిన సావాసగాడు, చదువు చెప్పిన మాస్టార్లను ఇంకోసారి చూడాలనిపిస్తోంది. ఎందుకంటే సిక్కోలులో ఇప్పుడు జ్ఞాపకాల రుతువు నడిపిస్తోంది. 'సర్' అనే పిలుపు అలవాటైపోయిన వాళ్లకు 'అరేయ్' అన్న పలకరింపును పరిచయం చేస్తోంది. కొత్త అనుబంధాల గజిబిజిలో పాత మిత్రులను కళ్లముందుంచుతోంది. ఇప్పుడు జిల్లా గెట్ టు గెదర్ అంటోంది.

సండే స్పెషల్

ఇచ్ఛాపురం రూరల్:

ఆనాటి క్లాస్ రూమ్, అప్పటి పాఠాలు, ఆ రోజులు పంచిన జ్ఞాపకాలను కొందరు మళ్లీ తరచి చూసుకుంటున్నారు. కాలంతో పాటు పరుగులు పెడుతున్న వారు కాసేపు ఆగి..బాల్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు. కొందరు బడికి వెళ్లి ఆ గోడలను తడిమి చూస్తున్నారు. ఇంకొందరు కాలేజీలకు వెళ్లి బెంచీలపై కూర్చుని సేద తీరుతున్నారు. మరికొందరు నాటి మిత్రులను కలిసి మళ్లీ స్టూడెంట్ లైఫ్‌కు వెళ్లిపోతున్నారు. జిల్లాలో గెట్ టు గెదర్ సీజన్ నడుస్తోంది. ప్రతి ఆదివారం ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు అపూర్వ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

గుర్తుకొస్తున్నాయి..

ఒకప్పుడు స్కూలు విడిచిపెట్టి వెళ్లిపోయాక స్కూల్‌డేస్ అన్నీ గుండెల్లోనే ఉండిపోయేవి. ఎప్పుడో ఎవరో క్లాస్‌మేట్ కలిస్తే ఆ జ్ఞాపకాలన్నీ మళ్లీ కళ్ల ముందుకు వచ్చేవి. సామాజిక మాధ్యమాలు వచ్చాక పాత జ్ఞాపకాలు నెమరవేసుకోవడం సులభమైంది. గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం, ఫొటోలు షేర్ చేసుకోవడం, పాత స్నేహితులను మళ్లీ పలకరించడం ఇప్పుడు అందరికీ నిత్యకృత్యమైంది. ఆ ముచ్చట్లను సెల్‌ఫోన్లకే పరిమితం చేయకుండా.. చాలా మంది పూర్వ విద్యార్థులు మళ్లీ స్కూళ్లకు వెళ్లి కలుస్తున్నారు. అందరికీ అనువైన రోజును ముహూర్తంగా పెట్టుకుని అప్పటి గురువులను పిలుచుకుని మనసారా సన్మానించుకుంటున్నారు.



1985-86 బ్యాచ్‌కు చెందిన గోవిందపురం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు(ఫైల్)

తారతమ్యాలు మరిచి..

స్కూలు, కాలేజీ రోజుల్లో దాదాపు అందరూ ఒకేలా ఉంటారు. కానీ రోజులు గడిచాక స్థాయిలు కూడా మారిపోతాయి. కొందరు 'పెద్దవాళ్లయిపోతారు'. చాలామంది 'చిన్నవాళ్లు'గానే మిగిలిపోతారు. ఆ వైరుధ్యం పిలుపుల్లోనూ స్థిరపడిపోతుంది. కానీ ఈ అపూర్వ సమ్మేళనాలు ఆ తారతమ్యాలను దూరం చేస్తున్నాయి. చిన్నప్పుడు క్యారేజీలో అన్నం పంచిన మిత్రుడు 'అరేయ్'అని పిలిస్తే ఎంతటి పెద్దవారికైనా ఆనందంగానే అనిపిస్తోంది. సమాజంలో హోదా ఎంతలా పెరిగినా మళ్లీ పాత మనిషిలా కల్మషం లేకుండా మారిపోవడం అందరికీ ఆనందాన్ని అందిస్తోంది.



స్నేహితుడు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.48,300 అందిస్తున్న ఈదుపురం పూర్వ విద్యార్థులు

సాటి వారికి సాయం

అపూర్వ సమ్మేళనాలు కేవలం ఆనందం కోసమే కాదు.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి కూడా ఉపయోగపడుతున్నాయి. కొన్ని బ్యాచ్‌లు సొసైటీలుగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయి. చనిపోయిన తమ మిత్రుల పేరిట కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కుటుంబానికి అండగా నిలుస్తూ పిల్లల పెళ్లిళ్లు, చదువులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. కష్టసుఖాల్లో ఒకరికి ఒకరు తోడుండాలని నిశ్చయించుకుంటున్నారు. కలకాలం తమ స్నేహం నిలిచేందుకు ఇవి దోహదపడతాయని అంటున్నారు.

30 ఏళ్లుగా కలుస్తున్నాం



నేను ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ ఏటా చిన్ననాటి స్నేహితులను కలిసేందుకు ఒక్క రోజును తప్పకుండా కేటాయిస్తాను. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటూ స్నేహితుల మధ్య వాలిపోయేవాడిని. గత 30 ఏళ్లుగా ఏటా 'గెట్ టు గెదర్'కు హాజరవుతున్నాను. చిన్ననాటి సంగతులు నెమరువేసుకోవడం, కష్టాల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవడం జీవితంలో భాగంగా మలచుకున్నాను. అందుకే రిటైర్ అయ్యాక సిటీ వదిలి సోంపేటలో ఇల్లు కట్టుకొని స్నేహితుల మధ్య స్థిరపడ్డాను.

– దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, హైదరాబాద్

సంతోషంగా ఉంది



నా స్వగ్రామం ఇచ్ఛాపురం అయినా, ఉద్యోగ రీత్యా శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సీసీగా పనిచేస్తున్నాను. ముప్పై మూడేళ్ల తర్వాత ఇటీవల స్నేహితులమంతా కలిశాం. మా మధ్యలేని స్నేహితుల పిల్లలు ఆర్థిక కష్టాల్లో ఉంటే వారి పిల్లల పేరున కొంత నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం, ఏటా టెన్త్ మెరిట్ విద్యార్థులకు రూ.22,500 మెరిట్ స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు నిర్ణయించుకున్నాం. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

– సాడి కామేశ్వరరావురెడ్డి, సీసీ, కలెక్టరేట్, శ్రీకాకుళం

సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అధికారులంతా సమన్వయంతో పని చేయాలని, అన్ని పనులకు కావాల్సినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జిల్లాలో చేపడుతున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో ఆయన స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గడపగడపకూ మంజూరు చేసిన పనులు వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుపై ఆరా తీశారు. పూర్తయిన బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. నగరపాలక సంస్థలో చేపడుతున్న గడప గడపకూ మన ప్రభుత్వంకు సంబంధించిన పనులపై ఆరా తీశారు. శ్రీకాకుళం–ఆమదాలవలస రహదారి విస్తరణ పనుల పురోగతిపై మాట్లాడారు. వారంలో చేసిన పనులపై సమావేశాలు నిర్వహించి డ్వామా పీడీ, పంచాయతీ రాజ్ ఎస్ఈ నివేదికలు అందించాలన్నారు.జూన్ 7న డీఆర్‌సీ మీటింగ్ ఉంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓలు బి.శాంతి, సీతారామ్మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకట్రామన్, డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి ఆస్పత్రిలో అన్నప్రసాద కేంద్రం ప్రారంభం



ఉచిత అన్న ప్రసాద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

టెక్కలి: ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా గత కొన్ని దశాబ్దాలుగా సత్యసాయి సేవా సమితి ద్వారా స్వచ్ఛమైన సామాజిక సేవలు అందజేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. భగవాన్ సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా కార్యక్రమంలో భాగంగా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఉచిత అన్న ప్రసాద సేవా కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి తదితరులు సత్యసాయి సేవా సమితి సేవల గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, టెక్కలి, నందిగాం ఎంపీపీలు ఎ.సరోజనమ్మ, ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పి.వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కె.బాలకృష్ణ, కె.గోవింద్, మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరావు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులకు ప్రాధాన్యం:ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి సోమవారం నాడు నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన)లో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయా ఫిర్యాదులపై కచ్చితమైన సమాచారం అందించాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఉదయం ఫిర్యాదుల పరిష్కార చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పందన ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ మాట్లాడుతూ ప్రతిరోజూ వెబ్‌సైట్ లో వచ్చే అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

పీఆర్ ఇంజినీర్ల సంఘ సమావేశం వాయిదా

అరసవల్లి: పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని ప్రకటించినప్పటికీ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి తెలియజేశారు. పీఆర్ ఇంజినీర్ల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆయన ప్రకటించారు.

ఏపీ పీఈసెట్ ఎగ్జామినర్‌గా శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీఈసెట్-2023 ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ రెండు వరకు జరగనుంది. గుంటూరుకు చెందిన నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శ్రీనివాసరావును పీఈ సెట్‌కు ఎగ్జామినర్‌గా నియమిస్తూ స్థానిక రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా అప్పలసూరి


నియామక పత్రం అందుకుంటున్న అప్పలసూరి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఆకుల అప్పలసూరిని నియమించినట్లు సంఘ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. శనివారం విశాఖలో కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం చంద్రమోహన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించి తూర్పుకాపుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ తూర్పుకాపు జేఏసీ రాష్ట్ర నాయకుడు గిరడ అప్పలస్వామి, జాతీయ కార్యదర్శి పున్నాని కనకారావు, యువజన విభాగం రాష్ట్ర సహాధ్యక్షులు సేపాన శ్రీనివాసరావు, పెద్దింటి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి కిల్లారి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

జి.సిగడాం: బీహార్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి రైలులో ప్రయాణిస్తున్న బీహార్‌కు చెందిన గుల్షన్‌కుమార్ అనే యువకుడు శనివారం జి.సిగడాం–పొందూరు ప్రాంతంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో పాటు రెండు చేతులు విరిగిపోయాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సతీష్‌కుమార్, ఎల్ఎన్ మూర్తి స్టేషన్‌కు చేరుకుని బాధితుడ్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కేసుల దర్యాప్తు వేగవంతం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : పెండింగ్‌లో ఉన్న నార్కోటిక్ డ్రగ్స్ కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలని, కేసులను త్వరితగతిన పరిష్కరించి ఆస్తి నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదైన నేరాలు, గ్రేవ్ కేసులు, నార్కోటిక్ డ్రగ్ కేసులు, మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, ఆస్తి నేరాలపై పోలీస్ స్టేషన్ల వారీగా సమీక్ష జరిపి ముందుగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీసి సరైన ఆధారాలు సేకరించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి ఛేదించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, నిరంతరం వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య కూడళ్లు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రతా నియమాలు అతిక్రమించినవారిపై జరిమానాలు వి ధించడంతో పాటు వాహనచోదకులు హెల్మెట్ ధరించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, టెక్కలి, కాశీబుగ్గ, శ్రీకాకుళం సబ్ డివిజనల్ డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వరరెడ్డి, వై.శృతి, దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవ్, ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు, బాలరాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పోరాటం తర్వాతే సంస్కరణలు


మాట్లాడుతున్న విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ

పలాస: శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం తర్వాతే దేశంలో అనేక సంస్కరణలు జరిగాయని విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద శనివారం జిల్లా అమరవీరుల స్మారక సభ నిర్వహించారు. ముందుగా ప్రముఖ విప్లవ కవి, అమరవీరుడు సుబ్బారావు పాణిగ్రాహి సహచరణి సురేఖ పాణిగ్రాహి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరుల బంధు మిత్రుల కమిటీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు జోగి కోదండరావు అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణ మాట్లాడుతూ శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట పూర్వాపరాలను వివరించారు. ఎంతోమంది యువకులు, నాయకులు ఈ పోరాటంలో అమరులయ్యారని చెప్పారు. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన ఈ పోరాటం వల్ల పాలకులు అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. నేడు అదాని, అంబానీ వంటి కొంతమంది చేతుల్లోనే దేశ సంపద కేంద్రీకృతమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు తామాడ త్రిలోచనరావు, పుచ్చ దుర్యోధనరావు, శేషయ్య, మోహిని, ధనలక్ష్మి, లత, బొడ్డు సింహాద్రి, కారి పురుషోత్తం, గుణవంతు, గంగయ్య, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ పెంచాలి


మాట్లాడుతున్న డీసీహెచ్ భాస్కరరావు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు పూర్తిస్థాయిలో ఉన్నా అందుకు తగ్గట్టు ఓపీ సేవలు లేవని జిల్లా ఆసుపత్రులు సమన్వయాధికారి జె.భాస్కరరావు అన్నారు. శనివారం నరసన్నపేట ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యుల హాజరు, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీ, ల్యాబ్ పరీక్షలు పెంచాలని సిబ్బందికి సూచించారు. శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో ఓ గర్భిణికి సుఖ ప్రసవానికి సిబ్బంది ప్రయత్నిస్తుండగా మృతి చెంది జన్మించడంతో బంధువులు నిరసన వ్యక్తం చేయడంపై సూపరింటెండెంట్ జయశ్రీతో మాట్లాడి వివరాలు సేకరించారు. కాగా, ఎముకల వైద్యులు కారుకు చార్జింగ్ ఆసుపత్రిలో పెట్టడం వల్ల ఎప్పటికప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోందని, విలువైన పరికరాలు దెబ్బతింటున్నాయని సిబ్బంది డీసీహెచ్ దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై చార్జింగ్ పెట్టనివ్వవద్దని ఆయన ఆదేశించారు.

'నీటిగింజల పంట' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో శ్రీకాకుళ సాహితి, చిక్కోలు బుక్‌ట్రస్టు సంయుక్త నిర్వహణలో కంచరాన భుజంగరావు రచించిన 'నీటిగింజల పంట' కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన రచయిత, విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ అణచివేతకు గురవుతున్న రైతుల గురించి రచయిత చక్కగా వివరించారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన రచయిత కె.శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరణ చేస్తూ రైతుల కష్టనష్టాలను పుస్తకంలో అద్భుతంగా పొందుపరిచారన్నారు. పార్వతీపురానికి చెందిన రచయిత గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ కవులు ఉత్తరాంధ్ర సమస్యలు, సాహిత్యంపై చర్చించడం అవసరమన్నారు. డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య మాట్లాడుతూ నైతిక విలువలు పెంపొందించేలా రచనలు చేయడం అభినందనీయమన్నారు. రచయితలు అట్టాడ అప్పలనాయుడు, కొప్పల భానుమూర్తిలు మాట్లాడుతూ యువ రచయితలు సామాజిక అంశాలపై కవిత్వం, కథలు రాయాలన్నారు. కవులు అనీల్ డ్యాని, పుప్పాల శ్రీరామ్‌లు పుస్తకంలోని అంశాలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో గజల్ వాసుదేవాచారి, పక్కి రవీంద్ర, బమ్మిడి సుబ్బారావు, కాశీపట్నం సుబ్బారావు, దాసరి రామచంద్రరావు, దాసుబాబు, మల్లిపురి జగదీష్, రచయిత్రి పత్తిసుమతి తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో 'రాజ్యరాణి' హాల్టింగ్


పాతపట్నం రైల్వేస్టేషన్

పర్లాకిమిడి/పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా కొనసాగనున్నాయి. ఆంధ్రతో పాటు ఒడిశాకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో గుణుపూర్ నుంచి రౌర్కెలా వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్(18118)కు ఈనెల 30 వరకు పాతపట్నంలో 2నిమిషాలు హాల్టింగ్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డీఆర్ఎం అనుప్‌కుమార్ శత్పతి శనివారం ప్రకటించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

సీఎంను కలిసిన ప్రముఖులు


ముఖ్యమంత్రితో వీసీ నిమ్మ వెంకటరావు


సీఎం జగన్‌తో బుడుమూరు రాజేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/ఎచ్చెర్ల క్యాంపస్: నీతి ఆయోగ్ సమావేశానికి ఢిల్లీ వెళ్లిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాపరమైన మార్పులు, నూతన విద్యా విధానం అమలు వివరించారు. అదే విధంగా, సీఎం జగన్ మోహన్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్ గౌరవపూర్వకంగా కలిశారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు బాగున్నాయని కృతజ్ఞతలు తెలిపారు. బీసీ కులగణనకు తోడ్పాటు, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లకు సహకారం అందించి మిగతా రాష్ట్రాలకు ఏపీ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు.

గడప గడపకూ 150వ రోజు..



గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా పాతపట్నం నియోజక వర్గంలోని ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. రాజపురంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం 150వ రోజు కార్యక్రమం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. –మెళియాపుట్టి

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,360–00
బంగారం(22సి. 10గ్రా.)	56,250–00
వెండి (కిలో)	77,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹160	₹275	₹ 295

ఆదర్శ గ్రామంగా చీపి


గ్రామాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మందస: మండలంలో గిరిజన గ్రామమైన చీపి ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. ఈ మేరకు అధికారులు శనివారం గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ సీతంపేట ఆదేశాలతో చీపి సర్పంచ్ సవర లక్ష్మీప్రియ, ఎంపీటీసీ సవర కాంచన, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఐటీడీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంగపండు శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సతీష్‌లు గ్రామంలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వం ఈ గ్రామానికి రూ.20లక్షలు మంజూరు చేసింది. నిధుల వ్యయంపై చర్చించారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సవర కామేసు, వైఎస్సార్ సీపీ నాయకులు సవర చిరంజీవి, సవర దీనబంధు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. యువకుడి మృతి


కోరాడ కార్తీక్ (ఫైల్)

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో అక్షర డిగ్రీ కళాశాల ఎదురుగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తివరం గ్రామానికి చెందిన కోరాడ కార్తీక్(16) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ తన స్నేహితుడు మద్దిల సిద్దార్థతో కలిసి కంచిలి వచ్చి పాలు సరఫరా చేసి తిరిగి స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా ఎదురుగా మోటారు సైకిల్‌తో అతివేగంగా వస్తున్న బొరివంక గ్రామానికి చెందిన బీన సందీప్ బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ముగ్గురూ కిందపడటంతో అంబులెన్స్‌లో సోంపేట సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. కార్తీక్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందాడు. సిద్దార్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

నేలబావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- డ్రైవర్ దుర్మరణం


మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పోలాకి: ట్రాక్టర్‌తో సహా నేలబావిలో పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన పోలాకి మండలం మగతపాడు పంచాయతీ అప్పారావుపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెలమర గ్రామానికి చెందిన పల్లి గోవిందరావు(35) ట్రాక్టర్ కలాసీగా, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ట్రాక్టర్ ఓనర్ కరుకోల దుర్యోధనరావుతో కలసి పొలాలు దుక్కి దున్నేందుకు వెళ్లాడు. అప్పారావుపేటలో చింతాడ శ్రీనివాసరావు పొలంలో దుక్కి దున్నుతుండగా అదే పొలంలో ఉన్న నేలబావిలో ట్రాక్టర్ దూసుకెళ్లిపోయింది. వెంటనే పోలీసులు, మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించగా అందరూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయాన్నే బావిలోని నీటిని తోడించారు. కొద్దిసేపటికి డ్రైవర్ గోవిందరావు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.